## 8న విద్యుత్తు బీసీ ఉద్యోగుల మహాసభ

హైదరాబాద్, జనవరి 5 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ విద్యుత్తు బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం 19వ రాష్ట్ర మహాసభను 8న హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్టు రాష్ట్ర అధ్యక్షుడు కే కుమారస్వామి ప్రకటనలో తెలిపారు. ఖైరతాబాద్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ఆడిటోరియంలో నిర్వహించనున్న మహాసభలో 2025 డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తామని పేర్కొన్నారు. ఎంపీలు ఈటెల రాజేందర్, ఆర్ కృష్ణయ్య ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్టు వెల్లడించారు.

## పల్లెల్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలి

**డీపీవోల సమీక్షలో మంత్రి సీతక్క**

హైదరాబాద్, జనవరి 5 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని ప్రతి పల్లెనూ ఆదర్శంగా తీర్చిదిద్దాలని పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లిప్తంగా ఉండొద్దని పేర్కొన్నారు. హైదరాబాద్ ఎర్రమంజిల్‌లోని గ్రామీణ మంచినీటి సరఫరా సెంట్రల్ ఆఫీసులో డీపీవోలతో ఆదివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో నిధుల వినియోగం, పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, అభివృద్ధి పనుల పురోగతిపై చర్చించారు. సమావేశంలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేశ్‌కుమార్, డైరెక్టర్ శ్రీజన తదితరులు పాల్గొన్నారు.

## రేపటి నుంచి సైన్స్ ఎగ్జిబిషన్

హైదరాబాద్, జనవరి 5 (నమస్తే తెలంగాణ) : విద్యార్థుల్లోని సైన్స్ ప్రతిభను వెలికితీసేందుకు, బాలశాస్త్రవేత్తలను గుర్తించేందుకు నిర్వహించే రాష్ట్రస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌ను 7నుంచి 9 వరకు నిర్వహించనున్నట్టు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి ప్రకటనలో తెలిపారు. జడ్చర్ల పోలేపల్లి సెజ్‌లోని ఎస్‌వీకేఎస్ స్కూల్‌లో నిర్వహించే ఈ ఎగ్జిబిషన్‌కు 830 మంది విద్యార్థులు హాజరుకానున్నట్టు పేర్కొన్నారు. ఈ ఎగ్జిబిషన్‌లో ప్రతిభ కనబరిచిన వారిని జాతీయస్థాయికి ఎంపికచేస్తామని తెలిపారు.

# ఎస్సీ కాలనీకి తాగునీటి కష్టాలు

- పది నెలలుగా రాని మిషన్ భగీరథ నీళ్లు
- వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి తెచ్చుకుంటున్న కాలనీవాసులు
- ఎంత మొరపెట్టుకున్నా పట్టించుకోని అధికారులు

గణపురం, జనవరి 5 : భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సొంత మండలమైన గణపురంలోని దళిత కాలనీ ప్రజలు పది నెలలుగా మిషన్ భగీరథ నీళ్లు రాక గోసపడుతున్నారు. అధికారులకు విన్నవించుకుంటున్నా పట్టించుకోవడంతో కిలోమీటర్ల దూరం వెళ్లి.. ప్రైవేట్ బోరుబావుల నుంచి బిందెలతో తెచ్చుకొని దాహార్తిని తీర్చుకుంటున్నారు. ఈ విషయమై దళితకాలనీ మహిళలు సంబంధిత అధికారులకు గోడును విన్నవించుకోగా, ఎస్సీ కాలనీకి పైపులైన్ సమస్య ఉందని, పూర్తి కాగానే నీళ్లిస్తామని నిర్లక్ష్యపు సమాధానం చెబుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. పది నెలలుగా తాగునీళ్లు లేక వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి తెచ్చుకుంటున్నామని, స్నానంతోపాటు దుస్తులు శుభ్రం చేసుకోవడానికి సైతం వ్యవసాయ బోర్లపైనే ఆధారపడాల్సి వస్తున్నదని పేర్కొన్నారు. ఇప్పటికైనా తమ గోడు విని, దాహార్తిని తీర్చాలని కాలనీప్రజలు వేడుకుంటున్నారు.



జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురంలోని దళితకాలనీలో ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న కాలనీవాసులు



### అధికారులు పట్టించుకోవడం లేదు

పది నెలలుగా మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి భగీరథ నీళ్లు రావడంలేదు. అనేకసార్లు గ్రామపంచాయతీ కార్యదర్శి, మిషన్ భగీరథ అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి దళిత కాలనీ ప్రజల సమస్యలను పరిష్కరించాలి.

**- కట్ల ప్రశాంతీశంకరయ్య, మాజీ సర్పంచ్**



కరీంనగర్ జిల్లా రేకుర్తి కంటి దవాఖానలో వివరాలు అడిగి తెలుసుకుంటున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వేణుగోపాల్

## నేత్ర వైద్యశాలకు హైకోర్టు న్యాయమూర్తి విరాళం

విద్యానగర్, జనవరి 5: కరీంనగర్ జిల్లా కేంద్రంలోని రేకుర్తిలోని డాక్టర్ మడేకర్ లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ ఉదార నేత్ర వైద్యశాలకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఈవీ వేణుగోపాల్ రూ.లక్ష విరాళాన్ని ప్రకటించారు. ఆదివారం దవాఖానను సందర్శించిన ఆయన సౌకర్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. పేదప్రజల కంటి ఆపరేషన్ల కోసం తన తండ్రి, టెక్స్‌టైల్స్ అండ్ హ్యాండ్లూమ్స్ రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్ రాజేశ్వర్‌రావు పేరిట రూ.లక్ష విరాళంగా అందిస్తున్నట్టు తెలిపారు. తెలంగాణ మలేషియా అసోసియేషన్ అధ్యక్షుడు సైదం తిరుపతి రూ.50 వేల విరాళం అందిస్తున్నట్టు ప్రకటించారు. పేద ప్రజలకు అండగా నిలిచేందుకు ముందుకు వచ్చిన జస్టిస్ వేణుగోపాల్, తిరుపతిని దవాఖాన యాజమాన్యం సత్కరించింది.



# పర్యాటక పటంలో కోటగుళ్లు, గణపసముద్రానికి చోటు

- టూరిజం శాఖ విడుదల చేసిన వీడియోలో స్థానం
- ప్రపంచవ్యాప్తంగా పర్యాటకశాఖ ప్రచారం

గణపురం, జనవరి 5 : పర్యాటకులను ఆకర్షించేందుకు పర్యాటక శాఖ చిత్రీకరించిన వీడియోలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురంలోని కాకతీయులు నిర్మించిన కోటగుళ్లు, గణపసముద్రం సరస్సు మత్తడికి చోటుదక్కింది. పర్యాటక అందాలు, వారసత్వ కట్టడాలుగా పేరొందిన గణపురం కోటగుళ్లు, గణప సముద్రాలకు రాష్ట్ర ప్రభుత్వం మొదటిసారి సముచిత స్థానం కల్పించింది. రామప్ప దేవాలయం, భూదాన్ పోచంపల్లి, యాదగిరిగుట్ట, పాండవుల గుట్ట, నాగార్జునసాగర్, జోడేఘాట్‌లోయ, నల్లమల, అమ్రాబాద్ టైగర్ రిజర్వ్, కిన్నెరసాని వైల్డ్ లైఫ్ శాంక్చురీ ప్రాజెక్టు, కుమ్రంభీం ప్రాజెక్టు, ఎస్సారెస్పీ (నందిపేట) వంటివి వీడియోలో ఉన్నాయి. సుమారు నిమిషం నిడివి గల వీడియోలో వీటిని పొందుపరిచారు.

# డిప్యూటీ సీఎం సభ అట్టర్‌ఫ్లాప్

- భట్టి మాట్లాడకుముందే వెళ్లిపోయిన జనం
- ఖాళీ కుర్చీలతో సభ వెలవెలా
- జనాలను ఆపే ప్రయత్నం చేసిన పోలీసులు

గీసుగొండ, జనవరి 5 : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదివారం గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ మొగిలిచెర్లలో నిర్వహించిన సభ అట్టర్ ఫ్లాఫ్ అయింది. విద్యుత్ ఉపకేంద్రాల శంకుస్థాపన అనంతరం నిర్వహించిన నియోజకవర్గస్థాయి బహిరంగ సభ జనాలు లేక వెలవెలబోయింది. డిప్యూటీ సీఎం సభను విజయవంతం చేయడానికి నాలుగు రోజులుగా పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి నియోజకవర్గంలోని 6 మండలాల్లో విస్తృతంగా పర్యటించారు. సభకు ప్రజలను భారీగా తరలించాలని స్థానిక నాయకులకు టార్గెట్లు పెట్టారు. నియోజకవర్గం నుంచి 4వేలమంది సభకు వచ్చి ఉంటారని స్థానిక నాయకులు చెబుతున్నారు. సభలో ఎమ్మెల్యే మాట్లాడుతుండగానే జనాలు వెళ్లిపోవడం మొదలు పెట్టారు. డిప్యూటీ సీఎం ప్రసంగించే సమయంలో ప్రజలంతా వెళ్లిపోయారు. పోలీసులు ప్రజలను ఆపే ప్రయత్నం చేసినా జనం మాత్రం ఆగలేదు. డిప్యూటీ సీఎం మాట్లాడుతుండగానే సభ ప్రాంగణమంతా ఖాళీ అయ్యింది. తన ఎకరం 16 గంటల భూమిని సబ్‌స్టేషన్ కోసం లాక్కున్నారని, మొగిలిచెర్ల గ్రామానికి చెందిన మహిళా రైతు మేడ వరలక్ష్మి డిప్యూటీ సీఎంను కలిసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకొని బయటకు పంపారు.



ఎల్ఈడీ స్క్రీన్‌లో డిప్యూటీ సీఎం ప్రసంగం, ఎదురుగా కనిపిస్తున్న ఖాళీ కుర్చీలు



ఉచిత కంటి వైద్యశిబిరంలో డ్రైవర్‌కు అద్దాలు అందిస్తున్న మంత్రి కోమటిరెడ్డి. చిత్రంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్

## రోడ్డు ప్రమాదాల నివారణకు చొరవ చూపాలి

- లారీ డ్రైవర్లకు మంత్రి కోమటిరెడ్డి సూచన
- హైవేపై డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు

చిట్యాల, జనవరి 5 : జాతీయ రహదారిపై ప్రమాదాలు జరగకుండా డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సూచించారు. జాతీయ రహదారిపై వెళ్లే భారీ వాహన డ్రైవర్ల కోసం నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వట్టిమర్తి వద్ద ఉన్న ఓ దాబా వద్ద ఆదివారం ఉచిత కంటి పరీక్షా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. హైదరాబాద్ – విజయవాడ రహదారిపై రోజూ 70 నుంచి 80 వేల వాహనాలు తిరుగుతున్నాయని, ఈ రహదారిపై ప్రమాదాలు నివారించేందుకు మొట్టమొదటిసారిగా జిల్లా యంత్రాంగం డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఎవరికైనా దృష్టిలోపం ఉంటే ఈ శిబిరంలో పరీక్షలు జరిపి తక్షణమే కళ్లద్దాలు ఇస్తున్నారని తెలిపారు. విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిని ఆరు లేన్లుగా మార్చేందుకు మే నెల చివరి నాటికి టెండర్లు పూర్తి చేసి, రెండు సంవత్సరాల్లో పనులు పూర్తి చేస్తామని చెప్పారు.



రోడ్డుకిరువైపులా హరితతోరణంగా చెట్లు

## హరిత‘దారి’

- గంగాధర మండలంలోని రోడ్లకు పచ్చలహారం
- ఏపుగా పెరిగిన హరితహారం మొక్కలతో ఆహ్లాదం

ఎటుచూసినా ఏపుగా పెరిగిన చెట్లు.. పరుచుకున్న పచ్చదనంతో గంగాధర మండలంలోని బీటీ రోడ్లు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. హరితహారంలో భాగంగా సామాజిక వేత్త గాలి భాస్కర్ కొన్నేండ్ల క్రితం గంగాధర మండలం ఉప్పరమల్యాల, రంగరావుపల్లి గ్రామాల మధ్య రోడ్డు వెంట నాటిన వివిధ రకాల మొక్కలు వృక్షాలుగా ఎదిగి దారి వెంట వచ్చీపోయే ప్రయాణికులకు సేద తీరుస్తున్నాయి. స్థానికులకు ఉల్లాసాన్ని ఇస్తూ, కొత్తగా ఇక్కడికి వచ్చేవారి మనసుకు హాయినందిస్తూ స్వాగతం పలుకుతున్నాయి.

**- గంగాధర, జనవరి 5**

# ఏడాదంతా కిక్కే..!

- పెరిగిన మద్యం అమ్మకాలు
- 2023 తో పోలిస్తే 2024లో జోరుగా విక్రయాలు

కరీంనగర్ రాంనగర్, జనవరి 5 : జిల్లాలో మద్యం అమ్మకాల జోరు కొనసాగుతున్నది. 2023 తో పోలిస్తే 2024లో మద్యం రూ.54 కోట్ల కు పైగా విలువైన మద్యం అమ్మకాలు పెరిగాయి. 2023 డిసెంబర్ ఒక్క నెలలో మద్యం విక్రయాలు రూ.133 కోట్ల జరుగగా, 2024 డిసెంబర్ నెలలో 126 కోట్ల మద్యం విక్రయాలు మాత్రమే జరిగాయి. డిసెంబర్ ఒక్క నెలకు సంబంధించి మాత్రమే 2023 తో పోలిస్తే 2024 లో మద్యం విక్రయాల్లో రూ.7 కోట్ల 73 లక్షలు తగ్గింది.

### పెరిగిన మద్యం అమ్మకాలు

కరీంనగర్ జిల్లాలో ఐదు ఎక్సైజ్ సర్కిల్స్ ఉన్నాయి. అందులో జమ్మికుంట, హుజూరాబాద్, తిమ్మాపూర్, కరీంనగర్ అర్బన్, కరీంనగర్ రూరల్‌లో అబ్కారీ స్టేషన్‌లు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 2023 వరకు వైన్స్, బార్లు రెస్టారెంట్లు మొత్తం కలిపి 219 దుకాణాలు ఉండగా 2023 జనవరి 1 నుంచి డిసెంబర్ 31 వరకు రూ.1099 కోట్ల 11 లక్షల పైచిలుకు మద్యం విక్రయాలు జరిగాయి. ఇక 2024లో జనవరి నుంచి డిసెంబరు వరకు జిల్లా వ్యాప్తంగా ఉన్న 126 బార్‌లు, మద్యం దుకాణాల్లో రూ.1153 కోట్ల 96 లక్షలకు పైగా మద్యం అమ్మకాలు జరిగాయి. అయితే, 2023తో పోలిస్తే 2024లో రూ.54 కోట్ల 85 లక్షలకు పైగా మద్యం విక్రయాలు పెరిగాయి.

### టార్గెట్ రూ.1500 కోట్లు

మద్యం విక్రయాలు ప్రభుత్వానికి ఆదాయ మార్గంగా ఉండడంతో అధికారులకు మరింత టార్గెట్ విధిస్తూ ప్రభుత్వం ఒత్తిడి పెంచుతోంది. స్థానిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ ఏడాది మరింత ఆదాయం రాబట్టేందుకు టార్గెట్లు విధించి మరీ మద్యం విక్రయాలు జరిగేలా చూడాలని ఇప్పటికే అధికారులకు మౌఖిక ఆదేశాలు అందినట్లు సమాచారం. ఈ మేరకు జిల్లా లక్ష్యం రూ.1500 కోట్లుగా తేలింది. ఇప్పటికే మద్యం వ్యాపారులకు కీలుబొమ్మలుగా మారిన అధికారులకు ప్రభుత్వం విధించిన టార్గెట్లు సవాల్‌గా మారాయి. ఇచ్చిన టార్గెట్లు పూర్తి చేస్తే జిల్లాలు ప్రాంతాలవారీగా అదనంగా మరిన్ని మద్యం దుకాణాల ఏర్పాటుకు మార్గం సుగమయవుతుందని ప్రభుత్వ పెద్దలు యోచిస్తున్నట్లు తెలుస్తోంది. నిర్దేశిత లక్ష్యం కోసం పనిచేసేందుకు ఒత్తిడి పెరుగుతుందని భావిస్తున్న ఎక్సైజ్ శాఖ అధికారులు ఒకరిద్దరు బదిలీపై వెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.





మురుగు నీటితో అధ్వానంగా ఇంకుడు గుంత

## తెలుకుంట ‘కస్తూర్బా’ కంపు కంపు

- అధ్వానంగా పారిశుధ్యం
- ఎక్కడ చూసినా చెత్త, మురునీటి నిల్వ
- పట్టించుకోని అధికారులు

జూలపల్లి, జనవరి 5: ప్రభుత్వ సంక్షేమ పాఠశాలలు అధ్వానంగా మారుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ లేక, సిబ్బంది పట్టింపు కరువై కంపు కొడుతున్నాయి. ఇందుకు తెలుకుంటలోని కస్తూర్బాగాంధీ విద్యాలయమే నిదర్శనంగా నిలుస్తున్నది. ఇక్కడ ఆరో తరగతి నుంచి ఇంటర్ దాకా దాదాపు 297 మంది అభ్యసిస్తుండగా, స్కూల్ పరిసరాల్లో పారిశుధ్యం లోపించింది. పిచ్చి మొక్కలు, ఎక్కడపడితే అక్కడ ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తా చెదారం, మురుగు నీటి నిల్వతో దుర్వాసన వస్తున్నది. అధికారులు వెంటనే స్పందించి పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.



పెద్దాపూర్‌లో నీరు లేక ఎండిపోతున్న పల్లె ప్రకృతి వనం

## చిన్నబోయిన పెద్దాపూర్ పల్లె ప్రకృతి వనం

- నిర్వహణ లోపంతో మొక్కలు ఎండి కళావిహీనం

జూలపల్లి, జనవరి 5: పర్యావరణ పరిరక్షణ, పల్లె ప్రజల ఆహ్లాదం కోసం లక్షలు వెచ్చించి ఊరూరా ఏర్పాటు చేసిన ‘పల్లె ప్రకృతి వనాలు’ కళ తప్పుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ, నిర్వహణ లోపంతో ఎండిపోతున్నాయి. ఇందుకు జూలపల్లి మండలం పెద్దాపూర్‌లోని ప్రకృతి వనమే నిదర్శనంగా కనిపిస్తున్నది. నాలుగేండ్ల కింద అప్పటి బీఆర్‌ఎస్ సర్కారు ఈజీఎస్ పథకం కింద రూ.6.76లక్షలు వెచ్చించి, తీరొక్క పండ్లు, పూలు, ఔషదం, నీడనిచ్చే మొక్కలు నాటి బృందావనంలా తీర్చిదిద్దింది. కానీ ప్రభుత్వం మారడం, పట్టించుకునేవారు లేక మొక్కలు ఎండిపోయి కళావిహీనంగా తయారైంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పల్లె ప్రకృతి వనాన్ని కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ఉత్సాహంగా 5కే రన్

ఫర్టిలైజర్‌సిటీ, జనవరి 5 : రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా రామగుండం కమిషనరేట్ పరిధిలో ఆదివారం చేపట్టిన 5కే రన్ ఉత్సాహంగా సాగింది. సీపీ శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొని శాంతికపోతాలను ఎగురవేసి, జెండాను ఊపి రన్‌ను ప్రారంభించగా పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి కమిషనరేట్ కార్యాలయం నుంచి మున్సిపల్ కార్యాలయం మీదుగా గాంధీచౌరస్తా వరకు కొనసాగింది. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ప్రతీ వ్యక్తి జీవితానికి భద్రత సురక్ష అని, ప్రమాదరహిత కమిషనరేట్‌గా మార్పునకు అందరూ సహకరించాలని కోరారు. రోడ్డు భద్రత నిబంధనలను ప్రతీ ఒక్కరు పాటించాలన్నారు. 5కే రన్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందిని సీపీ అభినందించారు. ఇక్కడ అడిషనల్ డీసీపీ అడ్మిన్ సీ రాజు, స్పెషల్ బ్రాంచి ఏసీపీ, మంచిర్యాల్ ఏసీపీ ఆర్ ప్రకాశ్, పెద్దపల్లి, బెల్లంపల్లి, జైపూర్ ఏసీపీలు జీ కృష్ణ, రవికుమార్, వెంకటేశ్వర్లు, ఏఆర్ ఏసీపీలు ప్రతాప్, సుందర్‌రావు, ట్రాఫిక్ సీఐలు అనిల్‌కుమార్, సత్యనారాయణ పాల్గొన్నారు.



రన్‌లో పాల్గొన్న సీపీ శ్రీనివాస్, అధికారులు

# రైతు భరోసా పేరిట కాంగ్రెస్ టోకరా

కథలాపూర్, జనవరి 5: రైతు భరోసా పథకం ద్వారా ఏటా రూ. 15 వేలు ఇస్తామని చెప్పి ఇప్పుడు రూ. 12 వేలు ఇస్తామని ప్రకటించి కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను టోకరా చేసిందని మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి మండిపడ్డారు. కథలాపూర్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలప్పుడు రైతులను నమ్మించి అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ ప్రభుత్వం వంచించడం దారుణమన్నారు. రైతుల సంక్షేమానికి కోత విధించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదన్నారు. కేబినెట్ సమావేశంలో రైతులను మోసం చేసే నిర్ణయాలు తీసుకోవడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రైతు భరోసా ఎకరానికి రూ. 15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకపోతే బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులు భూమయ్య, మహేందర్, శేఖర్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి

## ఎన్టీపీసీ హెచ్‌ఓపీగా చందన్‌కుమార్ సమంత

జ్యోతినగర్, జనవరి 5: ఎన్టీపీసీ రామగుండం, తెలంగాణ ప్రాజెక్టు హెడ్‌గా ఆదివారం చందన్‌కుమార్ సమంత బాధ్యతలు స్వీకరించారు. ఎన్టీపీసీ ఈడీ కేదార్ రంజన్‌పాండు ఉద్యోగ విరమణ నేపథ్యంలో బిహార్ రాష్ట్రంలోని నబీనగర్ ఎన్ఎస్‌టీపీపీ హెడ్‌గా ఉన్న చందన్‌కుమార్ ఇటీవల రామగుండానికి బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన తర్వాత ప్లాంటులో పర్యటించారు. ముందుగా టౌన్‌షిప్‌లోని హనుమాన్ ఆలయంలో పూజల అనంతరం ప్లాంటును సందర్శించారు. తెలంగాణ ప్రాజెక్టు సీహెచ్‌పీ సైలో యాష్‌డైక్, కంట్రోల్ గదిని పరిశీలించారు. ఇంజినీర్లతో ఇంటరాక్ట్ సమావేశం, యాష్‌డైక్ పొజిషన్, యాష్ యుటిలైజేషన్‌పై సమీక్షించారు.